క్లుప్తంగా

మహిళలకు న్యాయ సహాయం అందించండి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అపర్ణాదేవి, న్యాయవాదులు

గుంటూరు లీగల్: మానవ, మహిళల హక్కులకు సంబంధించిన కేసుల్లో న్యాయవాదులు ప్రత్యేకంగా వాదించి వారికి న్యాయ సహాయం అందించాలని గుర్రం జాషువా లా చాంబర్స్ ఏపీ న్యాయవాది అపర్ణాదేవి తెలిపారు. గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయదేవత విగ్రహం వద్ద గుర్రం జాషువా లా చాంబర్స్ ఏపీ 2023 క్యాలెండర్‌ను సహచర న్యాయవాదులతో కలసి శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సొపాటి బాబు, పుసులూరి జీవా, ఉప్పులూరి శరత్‌బాబు, ఇల్లా మధు బాబు, పలుకూరి ప్రసాదరావు, పాటిబండ్ల శ్యామ్, మొండితోక శ్రీనివాసరావు, నండూరి శ్రీనివాసరావు, కౌవెరపు రమేష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

పొన్నూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్ని వేగవంతంగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. చిన్న ఇటికంపాడులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం నివేశన స్థలాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఎంపీపీ భవనం పద్మలీల మాట్లాడుతూ సొంత ఇల్లు లేని పేదలు ఉండకూడదనే ఆలోచనతో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 1.30 లక్షల మందికి నివేశ స్థలాలు అందించారని తెలిపారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం చేసుకొనే లబ్ధిదారులకు రూ.1.80లక్షలతో పాటు సబ్సిడీపై సిమెంట్, ఇనుముతో పాటు ఇసుకను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మారుతీ శేషమాంబ, డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలల వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపు, మౌలిక సదుపాయాల కల్పనకు ఆవాస ప్రాంత స్థాయిలో వార్షిక ప్రణాళికల్ని తయారు చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కాకుమాను పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రతి పాఠశాల సముదాయాల్లో తొమ్మిది రోజుల పాటు సమావేశాలు నిర్వహించి, మౌలిక సదుపాయాల కల్పనపై నివేదికలను సిద్ధం చేయాలని చెప్పారు. తర్వాత వాటిని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. సమావేశంలో హెచ్‌ఎం టి.జోష్‌మేరి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య పనివారల సంఘం (వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ సంస్థ) క్యాలెండర్‌ను తన చాంబర్‌లో శనివారం మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల్ని తన దృష్టికి తెస్తే, వెంటనే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు బోడపాటి కిశోర్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ అంజిరెడ్డి, కాల్వపల్లి సాంబిరెడ్డి, యూనియన్ నాయకులు బత్తుల మరియన్న, భూపతి నాంచారయ్య, భజంత్రి రమణ, భీమవరపు రమణ, భజంత్రి శ్రీను, భూపతి సాంబశివరావు, గాలిముత్తం ఆదాం, పెదాల కృష్ణ, నక్కా నాంచారయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం హనుమాన్ చాలీసా అష్టోత్తర శత పర్యాయాల పారాయణ కార్యక్రమాన్ని కోగంటి వెంకట శ్రీరంగనాయకి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణ సర్వ కార్య జయం, ధైర్యం కలిగిస్తాయని తెలిపారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు మహా హారతి అనంతరం తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సభ్యుడు పుట్టగుంట ప్రభాకర్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు పర్యవేక్షించారు.

సీఎం జగన్ పాలనతో రాష్ట్రంలో స్వర్ణ యుగం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: రాష్ట్రంలో స్వర్ణ యుగం నడుస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఆయన ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్నారని చెప్పారు. అవ్వాతాతలకు, అక్కచెల్లెమ్మలకు ఇస్తున్న పింఛన్‌ను దశల వారీగా పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు జనవరి 1వ తేదీ నుంచి రూ.2,750 అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొత్తగా మంజూరు చేసిన 145 పింఛన్లతో కలుపుకుని పట్టణంలో 6,035 మందికి అందిస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీ నాయకులు దురుద్దేశంతో పింఛన్లు తొలగించామని ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే సూచించారు. గత పాలకులు జన్మభూమి కమిటీల పేరుతో పేదలకు ఇబ్బందులు పెట్టింది నిజం కాదా ? అని ప్రశ్నించారు. 2014లో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు 600కు పైగా హామీలు ఇచ్చారని, వాటిలో ఎన్ని అమలు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పేదలకు మేలు జరుగుతుంటే చంద్రబాబు అండ్ టీమ్ ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. 40 సంవత్సరాలు రాజకీయ అనుభవం, 14 సంవత్సరాలు సీఎంగా అనుభవం ఉన్న చంద్రబాబు పేదలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 1.30లక్షల మందికి నివేశ స్థలాలు అందించారని చెప్పారు. గతంలో ప్రభుత్వ భూములు, పోరంబోకులు, గ్రామ కంఠాలు మాత్రమే పంపిణీ చేశారన్నారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కోట్లు రూపాయలు ఖర్చు చేసి పేదలకు నివేశ స్థలాలు అందించారని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రాధ, నేతలు దాసరి నారాయణరావు, షేక్ సైపుల్లా, ఆకుల వెంకటేశ్వరరావు, బొద్దులూరి రంగారావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



నూతన పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

సీఎంకు రుణపడి ఉంటా



వృద్ధాప్యంలో ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ ఎంతగానో ఉపయోగపడుతోంది. జగన్ లాగా పథకాలు అమలు చేస్తున్న నాయకులు ఈ కాలంలో చాలా తక్కువ మంది ఉన్నారు. పింఛన్ నగదు పెంచడం సంతోషంగా ఉంది. సీఎంకు రుణపడి ఉంటాం.

– అనసూర్యమ్మ(2వ వార్డు)

మనవడిగా ఆదుకుంటున్నారు



అవ్వాతాతల్ని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక మనవడిగా ఆదుకుంటున్నారు. ఎటువంటి ఆసరా లేని సమయంలో వృద్ధులకు పింఛన్‌ను అందిస్తూ అండగా నిలుస్తున్నారు. నాయకుడంటే ఇలా ఉండాలని పని చేసి చూపిస్తున్నారు.

– జోజి(18వ వార్డు)

మలినేని కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాల్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్రేన్ గ్రూప్ సంస్థల సీఈవో గ్రంధి కాంతారావు మాట్లాడుతూ విద్యార్థినులంతా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ ఈ ఏడాదిలో తమ కళాశాలకు ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చిందన్నారు. జాతీయ స్థాయిలో అత్యున్నతమైన నాక్ ఏ ప్లస్ గ్రేడ్‌ను తమ కళాశాలకు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ ఉన్న మొదటి మహిళా కళాశాల తమ కళాశాల అవ్వడం సంతోషకరమని చెప్పారు. అనంతరం త్వరలో ప్రారంభించనున్న వేవ్ మ్యాగజైన్, సింగరాయకొండలోని మలినేని కళాశాలలో ప్రారంభించనున్న సంస్కృతి చిల్డ్రన్ స్కూలు కటౌట్లను ప్రారంభించారు. ముందస్తు సంక్రాంతి సంబరాల సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యార్థినులు, అధ్యాపకుల సంప్రదాయ దుస్తుల ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కోలాటం, చెక్క భజన, కోడి పందాలు, గంగిరెద్దుల ప్రదర్శన, విద్యార్థినుల దేవతామూర్తుల వేషధారణలు కనువిందు చేశాయి. అఖండ సినిమాలో ఎద్దులు చూపరుల్ని కట్టిపడేశాయి. అనంతరం విద్యార్థినులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు రూ. 5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ గోలి లక్ష్మయ్య, మ్యూజిక్ డైరెక్టర్ శశిప్రీతమ్, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.



దేవతామూర్తుల అలంకారాలతో విద్యార్థినుల నృత్యాలు

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

పొన్నూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ సూచించారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో ఈ నెల 4, 5 తేదీల్లో పాలిటెక్నిక్ ఇంటర్నల్ కళాశాల విద్యార్థులకు 25వ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో పొన్నూరు పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి కిలారి నవీన్ సత్తా చాటాడు. 1500 మీటర్లలో ప్రథమ, 400 మీటర్లలో ద్వితీయ, 800 మీటర్లలో తృతీయ, లాంగ్ జంప్‌లో తృతీయ, ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానాలు సాధించి వ్యక్తిగత ఓవరాల్ చాంపియన్ షిప్ టైటిల్ సాధించాడు. ఈ మేరకు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం కిలారి నవీన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నవీన్ మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. నవీన్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్‌ను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థి కిలారి నవీన్

సంక్షేమ పథకాల మంజూరులో దేశానికే ఆదర్శం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య

పొన్నూరు: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడంలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శం అని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పట్టణంలోని 20వ వార్డులో శనివారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని అవ్వాతాతలు, మహిళలు, చిన్నారులను ఎమ్మెల్యే పలకరించారు. గత మూడు సంవత్సరాలుగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు అందించిన పథకాలను వివరించారు. వార్డు సమస్యల్ని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజా సంక్షేమ పథకాల్ని అమలు చేస్తూ దేశంలోనే సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు అందరూ అండగా నిలవాలని చెప్పారు. పట్టణాభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందన్నారు. గత పాలకుల కాలంలో ఏ వార్డుకు వెళ్లినా గుంతల రోడ్లు, పగిలిపోయిన సీసీ రోడ్లు కన్పించేవని, నేడు పట్టణంలో ఎక్కడకు వెళ్లినా సీసీ రోడ్లు, డ్రైయినేజీలు కల్పిస్తాయని పేర్కొన్నారు.

చంద్రబాబుకు ప్రభుత్వ పథకాలు చూసి మతిభ్రమించింది

రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు చూసి చంద్రబాబుకు మతి భ్రమించిందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. అధికారంలోకి రాలేనని ఆలోచనతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు, గుంటూరు ఘటనలలో ప్రజల ప్రాణాలు పోతే ప్రభుత్వ వైఫల్యం అనటానికి టీడీపీ నాయకులకు బుద్ధి ఉండాలని హితవు పలికారు. ప్రజలకు ఇబ్బందిలేని ప్రాంతాల్లో సభలు, సమావేశాల నిర్వహించుకోవాలనే ఆలోచన టీడీపీ నాయకులకు లేకపోవటం సిగ్గుచేటని ఖండించారు. కార్యక్రమంలో షేక్ సైపుల్లా, షేక్ మాము, దాసరి నారాయణరావు, ఆకులు వెంకటేశ్వరరావు, చిగురుపాటి సుబ్బారావు, రఫీ, సయ్యద్ గౌస్, షేక్ నయీంభాష, బొద్దులూరి రంగారావు, మహమ్మద్, ఆరేటి మధు, పి. రమేష్, మోపర్తి ప్రమీల, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాజీ బాబా దర్గా పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

పెదకాకాని: స్థానిక బాజీబాబా దర్గాలో రూ. 1.97కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్ని శనివారం శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పరిశీలించారు. తాగునీటి పైప్ లైన్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. దర్గా వెళ్లే దారిలో సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. పనుల్ని వెంటనే పూర్తి చేయడానికి గానూ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. తొలుత బాజీబాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ మక్తార్ బాషా, ఎంపీడీవో బి. మల్లేశ్వరరావు, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఈ సాంబశివరావుతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన



కళాజ్యోత్స్నను అభినందిస్తున్న కలెక్టర్

నగరంపాలెం: వైఎస్సార్ కడప జిల్లాలోని రైల్వే కోడూరులో గత నెల 26, 27 తేదీల్లో కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన 66వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. అండర్ -19 కేటగిరిలో 59-63 కిలోల విభాగాన మైస్పేస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారిణి రాచమల్లు కళాజ్యోత్స్న రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించింది. దీంతో ఆమె జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో కళాజ్యోత్స్నను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, స్టెప్ సీఈఓ వెంకటనారాయణ శనివారం కలెక్టరేట్‌లో సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు సమన్వయకర్త సునీత, ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి ఎం.పూర్ణచంద్రరావు, అకాడమీ డీన్ అప్పిరెడ్డి, ప్రధాన ఆచార్యులు నిమ్మగడ్డ సురేష్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: ఆర్. అగ్రహారం శ్రీ రామనామ క్షేత్రంలో శ్రీ రామనామ సంకీర్తన సంఘం ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శనివారం శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు కల్యాణ విశేషాల్ని విశేషంగా పాల్గొన్న భక్తులకు వివరిస్తూ, కల్యాణాన్ని నిర్వహించారు. విశేష హారతి, మంత్ర పుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు వాసవీ మాత ఆలయంలో శిలాఫలకం ఆవిష్కరణ

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్రేన్ సంస్థల అధినేత జీ.వి.ఎస్.ఎల్. కాంతారావు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి, 108 ముత్తయిదువులకు పసుపుకుంకుమ అందిస్తారని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని నరసింహారావు కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష తెలిపారు. గ్రామంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్రామాల్లోనూ ఫ్యామిలీ డాక్టర్ ద్వారా సేవలందిస్తున్నారని తెలిపారు. గ్రామస్తులంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ గ్రామంలోని విలేజ్ క్లినిక్‌లో అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం గ్రామస్తులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. అర్హులైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ జిల్లా రిసోర్స్ పర్సన్ ఎం. వాసుదేవరావు, ఏఎన్‌ఎం ఆర్. ఇందిరమ్మ, జోనల్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, మబ్బు సుధాకర్, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సర్పంచ్ శిరీష తదితరులు

స్వచ్ఛ గుంటూరులో భాగస్వాములు కావాలి

మేయర్ కావటి, నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరు, ఆరోగ్య గుంటూరుగా నగరాన్ని మార్చుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో శనివారం వివిధ విభాగాల్లో స్వచ్ఛత పాటించడంలో ఆదర్శంగా నిలిచిన పలువురికి అవార్డుల్ని కమిషనర్ కీర్తి చేకూరితో కలసి అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి మెరుగైన ర్యాంకు తీసుకురావడానికి ప్రజలందరూ నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. త్వరలో ఇంటింటి చెత్త సేకరణకు వీలుగా 220 ఈ-ఆటోలు కూడా అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో గుంటూరు నగరం గత ఏడాదితో పోల్చితే ఉత్తమ ర్యాంకు సాధించడానికి నగరపాలక సంస్థ విస్తృత చర్యలు తీసుకుంటోందని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అన్ని వర్గాల్ని భాగస్వాముల్ని చేయడంలో భాగంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, రెస్టారెంట్లకు స్వచ్ఛతపై పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

పోటీల్లో విజేతలు

డ్రాయింగ్‌లో మొదటి మూడు స్థానాల్లో పి. త్రిష (సెయింట్ జోసెఫ్స్ స్కూల్), ఓ. సాయికృష్ణ, (కె.యస్.ఆర్.టి మున్సిపల్ స్కూల్), సీహెచ్ స్నేహ శ్రీలత (శ్రీ సరస్వతి విద్యానికేతన్), వక్తృత్వంలో వరుసగా యన్.శాలిని (విజ్ఞాన్ డిగ్రీ కాలేజీ), పి.యశస్వి (సెయింట్ జోసెఫ్స్ స్కూల్), యస్‌కే రియాజ్ (కె.యస్.ఆర్.టి మున్సిపల్ స్కూల్), వ్యాస రచనలో వరుసగా ఏ.పవన్ చంద్ (సెయింట్ ఇగ్నేషియస్ స్కూల్), యస్‌కే. ఖషిఫా (విజ్ఞాన్ విద్యాలయం), కె.మహేందర్‌రెడ్డి (భాష్యం స్కూల్), వాల్ పెయింటింగ్‌లో వరుసగా అప్పలనాయుడు, శివ బ్రహ్మాచారి (ఏయన్‌యూ), రమేష్, ఔదార్య, వైష్ణవి (ఏయన్‌యూ), షార్ట్ ఫిలింలో వరుసగా కుసుమ, ఉదయశ్రీ (సెయింట్ ఆన్స్ కాలేజీ ఫర్ ఉమెన్) సుబ్బారావు, బాబు నాయక్, సుహానా గ్రూప్ (సెయింట్ ఆన్స్ కాలేజీ ఫర్ ఉమెన్) విజేతలుగా నిలిచారు. స్వచ్ఛ స్కూలులో వరుసగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య స్కూల్, సెయింట్ జోసెఫ్స్ స్కూల్, సెయింట్ ఆన్స్ కాలేజీ ఫర్ ఉమెన్, స్వచ్ఛ హాస్పిటల్స్‌లో వరుసగా సెయింట్ జోసెఫ్స్ జనరల్ హాస్పిటల్, ఉదయ హాస్పిటల్స్, సాయి భాస్కర్ హాస్పిటల్స్, స్వచ్ఛ ఆర్‌డబ్ల్యూఏలో వరుసగా ప్రభుదాస్(తేజ టౌన్ షిప్), ఫరుద్దీన్(అభినందన టవర్స్), ఆదినారాయణ(శిల్పారామ ఒలింపిక్ టవర్స్), స్వచ్ఛ స్వయం సహాయక సంఘాలు వరుసగా గుల్జార్ (మదీనా గ్రూప్), వనజాక్షి(జయం గ్రూప్), ధనరాజ్య లక్ష్మి (చంద్రిక గ్రూప్), స్వచ్ఛ హోటల్స్‌లో వరుసగా వెల్ కమ్ హోటల్స్ ఐటీసీ, వెంకటేష్ గ్రాండ్, టోమాటోస్ రెస్టారెంట్ నిలిచాయి. స్వచ్ఛ మార్కెట్లలో వరుసగా చుట్టుగుంట రైతుబజార్, పీవీకే నాయుడు మార్కెట్, కొల్లి శారద మార్కెట్లకు బహుమతులు ప్రశంసా పత్రాలతో స్వచ్ఛ అవార్డుల్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, యంహెచ్‌ఓ భాను ప్రకాష్, కార్పొరేటర్ యేరువ సాంబిరెడ్డి, యస్‌యస్‌లు ఆనంద కుమార్, రాంబాబు, సోమశేఖర్, ఆయుబ్‌ఖాన్ పాల్గొన్నారు.



స్వచ్ఛత అవార్డులను అందజేస్తున్న మేయర్ కావటి, నగర కమిషనర్ కీర్తి చేకూరి

వివాలో ముందస్తు సంక్రాంతి సంబరాల సందడి



గంగిరెద్దు విన్యాసం



భోగి మంట వద్ద విద్యార్థినుల సందడి

పెదకాకాని: తెలుగుదనం ఉట్టిపడేలా, గ్రామీణ నేపథ్యం ప్రతిబింబించేలా వివా స్కూలులో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాల్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం రంగవల్లులు, గొబ్బెమ్మలు, గడ్డివాములు, ధాన్యపు బస్తాలతో పండుగ శోభను సంతరించుకుంది. భోగి మంటలతో వివా పాలకమండలి సభ్యురాలు వాసిరెడ్డి అరుణప్రియ, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ సంధానకర్త కె. మాధవి, డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.ఎస్.రావు సంబరాల్ని ప్రారంభించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు అలరించారు. పల్లె సంబరాల్లో భాగమైన గోపూజ, పొంగళ్ళు, పతంగులు, ఊయలలు, జోడెద్దుల బండి, కోడిపందాలతో సందడి చేశారు. సంక్రాంతి ప్రాముఖ్యతను తెలియపరుస్తూ విద్యార్థులు ప్రదర్శించిన హరిదాసు కీర్తనలు, సోదెమ్మ, బసవన్న, పిట్టలదొర, వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివా, వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల్ని నేటి బాలలకు పరిచయం చేసేందుకు ఈ వేడుకలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: నగర శివారుల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు శనివారం ఎస్ఈబీ పోలీసులు దాడిచేసి జూదరుల్ని అదుపులోకి తీసుకున్నారు. నల్లపాడు రైల్ విహార్ సమీపంలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఎస్ఈబీ పోలీసులు దాడిచేసి 13 మంది జూదరులను, వారి వద్ద నుంచి రూ. 42,050 స్వాధీనం చేసుకున్నారు. జూదరుల్ని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు.

బార్ ఏర్పాటును నిలిపివేయాలి

ముస్లిం ఐక్యవేదిక నాయకుల డిమాండ్

పాత గుంటూరు: తూర్పు నియోజకవర్గంలోని పొన్నూరు రోడ్డులో కనకదుర్గమ్మ గుడి, మసీదు, కళాశాల, ఇండియన్ బ్యాంకు, అంజుమన్ స్కూలు, నివాసాలున్న ప్రాంతంలో బార్ ఏర్పాటును ముస్లిం ఐక్యవేదిక నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ జియావుర్ రహమాన్ మాట్లాడుతూ ఇళ్ల మధ్య బార్ ఏర్పాటుకు నిర్వాహకులు లైసెన్స్ కోరితే వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బార్ ఏర్పాటు చేయవద్దని స్థానికులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. పాత గుంటూరు సీఐ వాసు ఘటన స్థలానికి చేరుకుని వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర జనరల్ సెక్రెటరీ హాజీ అబ్దుల్ కలాం, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బాజీ, సలీం, సభ్యులు అన్సారి, అల్లాబక్షు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నెహ్రూనగర్: పింఛన్ పెంపుతో అవ్వాతాతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర కానుక అందించారని 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని 122వ సచివాలయంలో శనివారం పింఛన్‌దారులతో కలసి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని కొనియాడారు. డివిజన్ పరిధిలో 1100 పైగా పింఛన్లు ఉండగా, కొత్తగా మరో 50 మంజూరయ్యాయని ఆమె చెప్పారు.